సాక్షి
మహబూబ్‌నగర్
గురువారం । 30 । మార్చి । 2023



పోటెత్తిన ఉల్లి

దేవరకద్రలోని మార్కెట్‌కు రైతులు బుధవారం పెద్దఎత్తున ఉల్లి తీసుకువచ్చారు.

వివరాలు 10లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-37 (గురువారం సాయంత్రం)

సహర్ 4-52 (శుక్రవారం తెల్లవారుజామున)

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.4 /22.6

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బోదకాల వ్యాధిపై సర్వే



పాలమూరు: జిల్లాలో కొనసాగుతున్న బోదకాల వ్యాధి సర్వేను బుధవారం డబ్ల్యూహెచ్‌ఓ బృందం పరిశీలించింది. బృందం సభ్యుడు డాక్టర్ దొరై, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్వేత, సబ్ యూనిట్ అధికారి రమేష్‌కుమార్ పలు పాఠశాలలో పరిశీలించారు. మహబూబ్‌నగర్, జానంపేట, భూత్పూర్, దేవరకద్ర పీహెచ్‌సీల పరిధిలోని పలు పాఠశాలలు తనిఖీ చేశారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 36 బృందాలతో సర్వే నిర్వహిస్తున్నారు.

వేరుశనగ క్వింటా రూ.7,575

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం వేరుశనగ క్వింటాల్‌కు గరిష్టంగా రూ.7,575, కనిష్టంగా రూ.4 వేలు లభించాయి. అలాగే మొక్కజొన్నకు గరిష్టంగా రూ.2,151, కనిష్టంగా రూ.1,711, పత్తి గరిష్టంగా రూ.7,299, కనిష్టంగా రూ.5,769, జొన్నలు గరిష్టంగా రూ.5,555, కనిష్టంగా రూ.5,111, పొద్దుతిరుగుడు గరిష్టంగా రూ.4,670, కనిష్టంగా రూ.4,580, ఆముదాలు రూ.6,222, కనిష్టంగా రూ.5,949 చొప్పున పలికాయి.

4న జెడ్పీ సమావేశం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఏప్రిల్ 4వ తేదీన స్థానిక జెడ్పీ మీటింగ్‌హాల్‌లో చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ జ్యోతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీలు, అధికారులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఆయా జిల్లా అధికారులు తమ శాఖకు చెందిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని సూచించారు.

శ్రీరామ నవమికి ముస్తాబైన ఆలయాలు



స్టేషన్ మహబూబ్‌నగర్: శ్రీరామ నవమిని పురస్కరించుకొని గురువారం పాలమూరు పట్టణంలో సీతారాముల కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఈ మేరకు ఆలయాల్లో సీతారాముల కల్యాణం కోసం ఏర్పాట్లు చేశారు. లక్ష్మీనగర్‌కాలనీలోని అభయాంజనేయస్వామి, న్యూగంజ్ లక్ష్మీనరసింహస్వామి ఆయాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం సహస్రనామార్చనతోపాటు పలు పూజా కార్యక్రమాలు, శ్రీసీతారామ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. బస్టాండ్ సమీపంలోని ద్వారకామాయి షిరిడీసాయి ఆలయం, రామమందిరం, తూర్పు కమాన్ సీతారామాంజనేయస్వామి, శ్రీనివాసకాలనీలోని పంచముఖాంజనేయస్వామి, టీడీగుట్ట తిరుమలనాథస్వామి, గణేష్‌నగర్‌లోని షిరిడీ సాయిబాబా, రామాంజనేయస్వామి, సంజయ్‌నగర్‌లోని వీరాంజనేయస్వామి, బాలాజీనగర్, నాగేంద్రనగర్, స్టేషన్‌గుట్ట, న్యూమోతీనగర్ ఆంజనేయస్వామి, టీకేరెడ్డికాలనీ శివాంజనేయస్వామి, వెంకటేశ్వరకాలనీ హయగ్రీవాలయంలో వేడుకలను జరుపనున్నారు. టీచర్స్‌కాలనీ శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం రాత్రి రథోత్సవంతో పాటు ఎదుర్కోళ్ల ఉత్సవం నిర్వహించారు.

బోగస్ బోనఫైడ్‌లు!

- ప్రైవేట్ కోచింగ్ సెంటర్ల దందా
- గురుకుల సీట్ల కోసం దొంగ సర్టిఫికెట్ల సృష్టి
- వనపర్తి జిల్లాకేంద్రంగా రెచ్చిపోతున్న మాఫియా
- విద్యాశాఖ అధికారులతో నిర్వాహకుల కుమ్మక్కు
- ఒక్కొక్కరి వద్ద రూ.50 వేల వరకు అదనంగా వసూళ్లు
- 'స్థానికత' కోల్పోతున్న విద్యార్థులు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: పేద, మధ్య తరగతి వర్గాల విద్యార్థులే టార్గెట్‌గా ప్రైవేట్ కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు దందా నిర్వహిస్తున్నారు. గురుకుల సీట్ల కోసం హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని ప్రైవేట్ పాఠశాలల నుంచి బోగస్ బోనఫైడ్ సర్టిఫికెట్లు సృష్టించి మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. అక్కడైతే గురుకులాలకు కాంపిటీషన్ తక్కువగా ఉంటుంది.. సీటు సులభంగా వస్తుందని అమాయక తల్లిదండ్రులతో నమ్మబలికి.. వారి నుంచి రూ.వేలు దండుకుంటున్నారు. ఒక్కొక్కరి వద్ద రూ.30వేల నుంచి రూ.50వేల వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. గురుకులాల్లో సీటు దక్కితే తమ పిల్లలు పదో తరగతి, ఇంటర్ వరకు విద్యతో పాటు హాస్టల్‌లో ఉచిత వసతి లభిస్తుందనే ఆశతో తల్లిదండ్రులు ఆర్థిక భారమైనా సమర్పించుకుంటున్నారు. ఎడ్యుకేషన్ హబ్‌గా రూపాంతరం చెందిన వనపర్తి జిల్లాకేంద్రంగా రెచ్చిపోతున్న విద్యా మాఫియాపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

ఎక్కడెక్కడ.. ఎలా అంటే..

ప్రాథమికోన్నత పాఠశాలలుగా అనుమతులు తీసుకున్నప్పటికీ.. పలు యాజమాన్యాలు హాస్టల్ వసతి ఏర్పాటు చేసి అనధికారికంగా కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తున్నాయి. ఇలా వనపర్తి, కొత్తకోట, పెబ్బేరు, ఆత్మకూరు మండలాల్లో కోచింగ్ సెంటర్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. వాటి నిర్వాహకులు గురుకుల, నవోదయ, సైనిక్ స్కూల్ తదితర పోటీ పరీక్షలకు అనువైన విద్యార్థులను ఎంపిక చేసుకుని శిక్షణ ఇస్తున్నారు. ప్రధానంగా ఐదు నుంచి ఏడో తరగతి స్టూడెంట్లను చేర్పించుకుంటున్నారు. ఆ తర్వాత నోటిఫికేషన్‌లో పేర్కొన్న వయసు మేరకు బోగస్ బోనఫైడ్‌లు సృష్టిస్తున్నారు. వయసు తక్కువ ఉన్నా.. ఎక్కువ ఉన్నా.. సర్టిఫికెట్లలో నిర్దేశిత వయసు ప్రకారం పుట్టిన తేదీ, నెల, సంవత్సరం మార్చి పోటీ పరీక్షలకు దరఖాస్తు చేపిస్తున్నారు.

'స్థానికత'తో చెలగాటం..

గురుకుల సీట్లే లక్ష్యంగా ప్రైవేట్ కోచింగ్ సెంటర్లు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు అక్కడే చదివినట్లు బోనఫైడ్, తదితర సర్టిఫికెట్లు సృష్టిస్తున్నారు. గురుకులాల్లో సీటు వస్తే పిల్లలు ఐదు నుంచి ఏడేళ్లు అక్కడే హాస్టల్ ఉంటూ చదువుకుంటారని.. తగిన ఆర్థికస్థోమత లేకపోవడంతో ఇదే మేలని భావించిన తల్లిదండ్రులు అందుకు ఒప్పుకుంటున్నారు. కానీ అక్కడే వరుసగా చదివినట్లు సర్టిఫికెట్లు సృష్టిస్తున్న క్రమంలో ఆయా విద్యార్థులకు అక్కడి స్థానికతే వర్తిస్తుంది. దీన్ని గ్రహించకపోవడంతో ఆ విద్యార్థులు భవిష్యత్‌లో నష్టపోయే అవకాశం ఉంది. ఈ మేరకు విద్యాశాఖాధికారులు అక్రమాలకు పాల్పడుతున్న ప్రైవేట్ కోచింగ్ సెంటర్లపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇలా వెలుగులోకి.. అయినా చర్యలు శూన్యం

జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం గార్లపాడులోని మండల పరిషత్ హైస్కూల్‌లో నాలుగో తరగతికి చెందిన ఒకరు, ఐదో తరగతికి చెందిన ఇద్దరు, ఆరో తరగతికి చెందిన ఒక విద్యార్థి ట్రాన్స్‌ఫర్‌కు దరఖాస్తు చేయకుండానే 2022-23లో పెబ్బేరులోని సరస్వతి విద్యానికేతన్, శ్రీవిజ్ఞాన్ హైస్కూల్‌లో అడ్మిషన్ తీసుకున్నారు. వారికి ఎంఈఓ లాగిన్‌లో ఆన్‌లైన్ డేటాకు పర్మిషన్ ఇచ్చారు. పసిగట్టిన ఆ స్కూల్ హెచ్‌ఎం ఈ సమాచారాన్ని గద్వాల డీఈఓకు అందించగా.. ఆయన వనపర్తి డీఈఓ రవీందర్‌కు ఫిర్యాదు చేశారు. సదరు విద్యాసంవత్సరంలో ఆయా పాఠశాలల్లో చదివినట్లు తప్పుడు రికార్డులు సృష్టించారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. గతేడాది నవంబర్‌లో ఫిర్యాదు చేసినా.. ఇప్పటివరకు ఎవరిపై చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

ఎంఈఓల లాగిన్ నుంచే అక్రమాలు..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థుల వివరాలను ప్రతి ఏటా తరగతుల వారీగా విద్యాశాఖ యూడైస్ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. ప్రతి ఒక్క విద్యార్థి వివరాలను ఎంఈఓ లాగిన్ ద్వారా నమోదు చేస్తారు. ఎవరైనా విద్యార్థి వేరే స్కూల్‌లో చేరాలనుకుంటే ప్రస్తుతం చదువుతున్న పాఠశాలకు ట్రాన్స్‌ఫర్ కోసం దరఖాస్తు చేయాలి. ఆ స్కూల్ హెచ్‌ఎం అనుమతి తీసుకోవాలి. తీసుకోని పక్షంలో ఆ విద్యార్థిని వేరే పాఠశాలలో చేర్చుకునే అవకాశం లేదు. కానీ ఆయా కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు అడ్డదారుల్లో ఈ తతంగం నడిపిస్తున్నారు. ఎంఈఓ లాగిన్ నుంచి అక్రమాలకు తెరలేపారు. గతంలో చదివిన స్కూల్‌తో సంబంధం లేకుండా.. తమ వద్దే అన్ని తరగతులు చదివినట్లు లేదంటే హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి బోగస్ రికార్డులు సృష్టిస్తున్నారు. నేరుగా వారు ఎంఈఓల లాగిన్ నుంచే ట్యాంపరింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు ఎంఈఓ కార్యాలయాల్లో కంప్యూటర్ ఆపరేటర్లు, డీఈఓ కార్యాలయంలోని పలువురు ఉద్యోగులు, సిబ్బందికి ముడుపులు అందజేస్తున్నట్లు సమాచారం.

కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేస్తున్నాం..



ఈ విషయంపై జిల్లాలోని కొన్ని పాఠశాలలపై ఫిర్యాదులు వచ్చాయి. కలెక్టర్ ఆదేశం మేరకు విచారణ చేస్తున్నాం. ఎంఈఓల లాగిన్ నుంచి యూ డైస్ ఎలా మార్చారనే విషయాన్ని తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. పెబ్బేరు పట్టణంలోని స్కూల్స్‌పై వచ్చిన ఫిర్యాదులపై విచారణ పూర్తి కాలేదు. త్వరలో విచారణ పూర్తిచేసి చర్యలు తీసుకుంటాం.
– రవీందర్, డీఈఓ, వనపర్తి

పుర బడ్జెట్.. రూ.266.68 కోట్లు

ఆమోదం తెలిపిన మున్సిపల్ కౌన్సిల్

- కొన్ని పద్దుల్లో జీరో. తక్కువ ఆదాయం ఎలా చూపారు?
- అధికారులను నిలదీసిన ప్రతిపక్ష కౌన్సిలర్లు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కొత్త ఆర్థిక సంవత్సరం 2023–24లో రూ.266.68 కోట్లతో రూపొందించిన స్థానిక మున్సిపల్ బడ్జెట్ అంచనాలకు బుధవారం కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఇందులో ఇంటి, ఇతర పన్నుల నుంచి రూ.27,30,58,000 ఆదాయం వస్తుందని చైర్మన్ కేసీ నర్సింహులు తెలిపారు. పన్నేతర వనరుల కింద రూ.17,92,80,000 డిపాజిట్లు, అడ్వాన్సులకు రూ.1,20,00,000, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రణాళిక, ప్రణాళితేర గ్రాంట్ల ద్వారా రూ.220,25,00,000 వస్తుందని వివరించారు. ఈ బడ్జెట్‌లో వ్యయం కింద రూ.235,17,69,000 చూపారు. కాగా.. వివిధ గ్రాంట్లను మినహాయించి వార్షిక, సాధారణ అంచనా బడ్జెట్ మొత్తం రూ.46,12,99,000గా పేర్కొన్నారు. ఇందులో పన్నుల రాబడి కింద రూ.27,30,58,000, పన్నేతర రాబడి రూ.17,92,80,000 వస్తుందన్నారు. 2022– 23 ఆర్థిక సంవత్సరాంతానికి రూ.89,61,000 మిగులు చూపారు. ఇక 2023–24లో ఖర్చుల కింద రూ.45,77,69,000 అంచనా వేశారు. ఇవి పోను రూ.35,30,000 మిగులు బడ్జెట్‌గా రూపొందించారు.

పద్దులపై చర్చ సాగిందిలా..

మున్సిపాలిటీకి చెందిన దుకాణాల ద్వారా అద్దె 2022–23లో రూ.4.50 కోట్లు వస్తే 2023– 24 రూ.3.50 కోట్లు మాత్రమే రావచ్చని బడ్జెట్‌లో ఎలా చూపారని బీజేపీ ఫ్లోర్ లీడర్ ఎ.అంజయ్య అధికారులను ప్రశ్నించారు. వేలంలో పాట పాడిన ప్రకారం వచ్చే ఏడాది ఇంకా పెరిగే అవకాశం ఉంటుందన్నారు. పేరుకుపోయిన రూ.8 కోట్ల బకాయిలను వసూలు చేయాలన్నారు. ఏడాదిన్నర క్రితం గాంధీనగర్‌లో పాత బిల్డింగ్ కూల్చివేసి కొత్త షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించినా ఇంత వరకు ఎందుకు అద్దెకు ఇవ్వలేదన్నారు. దీని ద్వారా మున్సిపాలిటీ ఆదాయం పెంచుకోవచ్చన్నారు. లే- అవుట్ల ఫీజు కింద గతంలో రూ.20 లక్షలు వస్తే ఇప్పుడు జీరో ఆదాయం అని అంచనా వేశారని నిలదీశారు. 2022–23లో వివిధ సందర్భాల్లో వీఐపీలు జిల్లాకేంద్రానికి వచ్చినందుకు రూ.89 లక్షలు మున్సిపాలిటీ (ఫ్లెక్సీల ప్రకటనలకు) ఖర్చు చేస్తే ఈ బడ్జెట్‌లో ఎందుకు చూపించలేదన్నారు. ఎర్రమన్ను గుట్ట శివారులోని చెత్త డంపింగ్ యార్డు ద్వారా వెలువడుతున్న పొగతో వీరన్నపేట, టీడీగుట్ట ప్రాంతవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిని దూరంగా తరలించాలని, పట్టణ ప్రజల అవసరాల రీత్యా మరోటి ఏర్పాటు చేయాలన్నారు. ఈ బడ్జెట్‌లో రూ.5.90 కోట్ల ఆదాయం పెంచి చూపించిన అధికారులు అది ఏ రూపంలో వస్తుందో.. ఎలా సమకూరుతుందో చెప్పాలని కాంగ్రెస్ కౌన్సిలర్ స్వప్న నిలదీశారు. 2022– 23లో పన్నేతర వనరుల ద్వారా ఆదాయం రూ.2.96 కోట్లు వస్తే.. 2023–24 బడ్జెట్‌లో రూ.6.32 కోట్లు రావచ్చని ఎలా అంచనా వేశారని ప్రశ్నించారు. స్టాంప్ డ్యూటీని జీరోగా చూపారని, 2022–23లో ప్రకటనల ద్వారా ఆదాయం ఏమీ లేదని చెప్పడం తగదన్నారు. మూడేళ్లకు సంబంధించి డిమాండ్ కలెక్షన్ బ్యాలెన్స్ వివరాలు కౌన్సిల్ ముందుంచాలన్నారు. జంతువధ శాల నుంచి ఎలాంటి ఆదాయం రాకపోవడానికి కారణమేమిటని అడిగారు. ట్రేడ్ లైసెన్స్ ఫీజు కింద 2021–22లో రూ.14 లక్షలు వస్తే.. 2022– 23లో రూ.లక్షకు ఎలా పడిపోయిందని, పట్టణంలో కేవలం 560 దుకాణాలే ఉన్నాయా అని ప్రశ్నించారు. ఈ బడ్జెట్ పట్టణాభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందని బీఆర్‌ఎస్ కౌన్సిలర్ రవికిషన్ రెడ్డి అన్నారు. బండ్లగేరి, క్లాక్‌టవర్ ప్రాంతాల్లో తాగునీటి పైపులైన్‌కు లీకేజీలు ఏర్పడ్డాయని.. ప్రత్యేక నిధులు కేటాయించాలని కలెక్టర్ రవినాయక్‌కు కౌన్సిలర్ వేదవ్రత్ విజ్ఞప్తి చేశారు.



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు మొక్క అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు

పట్టణ అభివృద్ధికి మరిన్ని నిధులు

పట్టణ అభివృద్ధికి మరిన్ని నిధులు తెస్తామని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. వార్షిక బడ్జెట్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇప్పటికే మంజూరైన రూ.150 కోట్లతో వార్డుల వారీగా పనులను గుర్తించి మూడు నెలల్లోగా ప్రారంభించాలని ఆదేశించారు. ఐదుగురు ఇంజినీరింగ్ సిబ్బందిని న్యాక్ ద్వారా నియమిస్తామన్నారు. రెండు మూడు ఎకరాల్లో వృద్ధాశ్రమం ఏర్పాటు చేస్తామన్నారు. దివిటిపల్లిలోని ఐటీ కారిడార్‌లో అమరరాజా కంపెనీతోపాటు మరిన్ని అంకుర సంస్థలు ఏర్పాటు కానున్నాయన్నారు. ఈ ప్రాంతాన్ని మున్సిపల్ పరిధిలోకి తెస్తామని, దీని ద్వారా ప్రాపర్టీ ట్యాక్స్ రూ.కోట్లలో వస్తుందన్నారు. భవిష్యత్‌లో మున్సిపల్ కార్పొరేషన్‌గా మారుస్తామన్నారు. త్వరలోనే కొత్త బస్టాండ్ సమీపంలో మల్టీప్లెక్స్ ఏర్పాటు చేస్తామన్నారు. అంతకు ముందు కలెక్టర్ రవినాయక్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి కౌన్సిల్ సభ్యులు, అధికారులు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్‌కుమార్, ఏఎంసీ శంకర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన కౌన్సిల్ సభ్యులు

పకడ్బందీగా 'పది' పరీక్షలు



మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాలో పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ రవినాయక్ అన్నారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై బుధవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హైదరాబాద్ నుంచి విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ దేవసేనతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, విద్యాధికారులు, పోలీసులతో వీసీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వచ్చేనెల 3 నుంచి 13 వరకు పదో తరగతి పరీక్షలు కొనసాగుతాయన్నారు. విద్యార్థులు పరీక్ష రాసేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపాలని, విద్యుత్ శాఖ ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని, అన్ని పరీక్ష కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించాలని ఆదేశించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని నీడ వసతి, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని, పరీక్ష కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ విధింపు, జిరాక్స్ కేంద్రాల మూసివేత చేపట్టాలన్నారు. విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ మాట్లాడుతూ విద్యార్థులు తమ హాల్ టికెట్లను bse.telangana.gov.in ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు.

లాంగ్వేజ్, సైన్స్ పేపర్లకు..

అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో పరీక్షల నిర్వహణపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోజిట్ కోర్సు, సైన్స్ పరీక్ష రాసేందుకు అదనంగా మరో 20 నిమిషాలు కేటాయించాలని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో విద్యార్థులు పరీక్ష రాసేందుకు 59 కేంద్రాలు, ఒక ప్రైవేట్ కేంద్రం కలిపి మొత్తం 60 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 12,829 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. ఈసారి పదో తరగతి పరీక్షలు 11కు బదులుగా 6 పేపర్లే ఉంటాయన్నారు. విద్యార్థులు తమ సౌకర్యార్థం పరీక్షకు రెండు రోజుల ముందే పరీక్ష కేంద్రాలకు వెళ్లి చూసుకోవాలని సూచించారు. ఆయా సమావేశాల్లో డీఈఓ యాదయ్య, డీఎస్పీ మహేష్, డీపీఓ వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌కో ఎస్‌ఈ శ్రీరాంమూర్తి, డీఎంహెచ్‌ఓ కృష్ణ, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ కమలాకర్ పాల్గొన్నారు.

ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తాం



ఫోన్‌లో ఫిర్యాదులు తీసుకుంటున్న ఆర్‌ఎం శ్రీదేవి

స్టేషన్ మహబూబ్‌నగర్: డయల్ యువర్ ఆర్‌ఎంకు వచ్చిన ప్రయాణికుల ఫిర్యాదులు, సూచనలను పరిశీలించి పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీదేవి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్‌ఎం కార్యాలయంలో బుధవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ ఆర్‌ఎం నిర్వహించి ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. కోస్గి డిపో నుంచి మొకర్లబాద్ మీదుగా మంగంపేట, చౌదర్‌పల్లి, గాదిర్యాల్, చిన్నవార్వాల్, పెద్దవార్వాల్‌కు బస్సు నడపాలని, మహమ్మదాబాద్ చౌరస్తాలో బస్సులు ఆపాలని, మహబూబ్‌నగర్ నుంచి దేవరకద్ర, మరికల్, ఉందేకోడ్ వరకు బస్సులు నడపాలని కోరారు. మహబూబ్‌నగర్ బస్టాండ్‌లోని ఉడిపి హోటల్ వెనక భాగంలో దుర్వాసన రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ప్రయాణికుల నుంచి ఫోన్‌లో ఫిర్యాదులు తీసుకున్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు



పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా రెండు వారాలపాటు జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షలు ముగిశాయి. మంగళవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు పూర్తి కాగా.. బుధవారం రోజు రెండో సంవత్సరం విద్యార్థులకు పూర్తయ్యాయి. అయితే ఒకేషనల్ విద్యార్థులకు మరో రెండు రోజులపాటు బ్రిడ్జి కోర్సుల పరీక్షలు జరగనున్నాయి. వీటి కోసం అధికారులు 7 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. కోయిల్‌కొండ ఘటన మినహా మిగతా ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. చివరి రోజు పరీక్షలకు మొత్తం 9,048 మంది విద్యార్థులకు గాను 8,790 మంది హాజరవగా.. 258 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు పూర్తికావడంతో విద్యార్థులు ఇంటిబాట పట్టారు. బస్టాండ్ తదితర ప్రాంతాల్లో విద్యార్థుల కోలాహలం కనిపించింది.

ఏడుగురికి నోటీసులు

కోయిల్‌కొండ పరీక్ష కేంద్రంలో ఈ నెల 20న జరిగిన మ్యాథ్స్ ఫస్టియర్ పరీక్షలో పలువురు విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతూ దొరికిపోవడం చర్చనీయాంశంగా మారింది. అయితే బుక్ చేసిన అధికారులు రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు ఫ్లయింగ్ స్క్వాడ్ కావడంతో ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తుంది. కళాశాలలో మొత్తం 9 మంది విధులు నిర్వహించగా ఏడుగురికి నోటీసులిచ్చారు. సోమవారం వీటికి సంబంధిత సిబ్బంది సమాధానం ఇచ్చినట్లు తెలుస్తుంది. అయితే వీరిపై చర్యలు తీసుకునే అధికారం డీఐఈఓకు లేకపోవడంతో ఫైలును బోర్డుకు పంపించినట్లు సమాచారం.

సరైన ప్రణాళికతో చదివితే విజయం



మాట్లాడుతున్న ఎస్పీ కె.నరసింహ

మహబూబ్‌నగర్ క్రైం: పరీక్షల్లో సరైన ప్రణాళిక ఏర్పాటు చేసుకుని చదివితే మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించవచ్చని ఎస్పీ కె.నరసింహ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పరీక్ష విధానంపై బుధవారం జిల్లాకేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థినుల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే డయల్ 100, షీటీం పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. సోషల్ మీడియాలో ఎవరూ కూడా వ్యక్తిగత వివరాలు పోస్టు చేయరాదన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మహేష్, సీఐలు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, ఎంఈఓ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

■ రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స ముఖ్యమని, ఇటీవల గుండెపోటు మరణాల సంఖ్య పెరుగుతున్న క్రమంలో సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలని ఎస్పీ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో చిరు వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, విద్యార్థులకు యాక్సిడెంట్ ఫస్ట్ రెస్పాండెర్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఏదైనా ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి మొదట ప్రథమిక చికిత్స చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములు, రోడ్ సేఫ్టీ డీఎస్పీ చంద్రబాబు, సీఐ రాజేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వలలో చిక్కుకుని మత్స్యకారుడి మృతి

అమరచింత: ఆత్మకూర్ పట్టణానికి చెందిన ఆటో కురుమన్న(63) అనే మత్స్యకారుడు బుధవారం చేపలవేటకు వెళ్లి వలలో చిక్కుకొని మృతి చెందాడు. పట్టణానికి చెందిన కురుమన్న వృత్తి రీత్యా బుధవారం తెల్లవారుజామున రామన్‌పాడు బ్యాక్ వాటర్‌లో చేపలు పట్టడానికి బయలు దేరాడు. ఉదయం ఎనిమిది గంటలైనా ఇంటికి రాకపోవడంతో కురుమన్న పెద్దకుమారుడు గోవర్దన్ రామన్‌పాడ్ జలాశయానికి వెళ్లి పరిశీలించాడు. వలలో చిక్కుకుని విగతజీవిగా పడిఉన్నాడు. వెంటనే విషయాన్ని కుటుంబ సభ్యులకు, ఆత్మకూర్ పోలీసులకు తెలియజేశాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ బీచుపల్లయ్య తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

మహబూబ్‌నగర్ క్రైం: అనారోగ్య సమస్యలతో ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. మద్దూరు మండలం దుప్పటిగట్టుకు చెందిన దస్తప్ప(45) కొన్ని రోజులుగా మేస్త్రీ పనిచేస్తూ జిల్లాకేంద్రంలోని కోయనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈ నెల 28న ఉదయం 7 గంటల ప్రాంతంలో పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబ సభ్యులు చికిత్స కోసం జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతిచెందాడు. మానసిక పరిస్థితి సక్రమంగా లేకపోవడంతోపాటు ఆరోగ్య సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నాడని దస్తప్ప కొడుకు శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

'పేట'లో యువకుడు..

నారాయణపేట రూరల్: పురుగు మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బొమ్మన్‌పాడుకు చెందిన ఉగ్గరాజు (24) తల్లిదండ్రులు మృతి చెందడంతో.. దగ్గరి బంధువుల సహకారంతో నివాసం ఉంటున్న రాజుకు మూర్ఛరోగం ఉంది. దీనిపై తరుచూ ఆవేదన చెందుతున్న క్రమంలో ఈ నెల 25న మధ్యాహ్నం ఇంట్లో ఉన్న పురుగు మందు సేవించాడు. దీన్ని గుర్తించిన గ్రామస్తులు నారాయణపేట ఏరియా ఆస్పత్రిలో ప్రథమచికిత్స నిర్వహించి మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతుడి పెద్దనాన్న కొడుకు వెంకటప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

బైక్ ఢీకొని..

ఉండవెల్లి: మండలంలోని బొంకూరులో మంగళవారం రాత్రి శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న మల్లికార్జున (50)ను బైక్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడని.. కుమారుడు పరశురాం ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు. ఆయన కథనం మేరకు.. కర్ణాటకకు చెందిన మల్లికార్జున ఇతర భక్తులతో కలిసి శ్రీశైలం క్షేత్రానికి పాదయాత్రగా వెళ్తున్నారు. గ్రామ శివారులో కర్నూలుకు బైక్‌పై వెళ్తున్న అల్పేష్ వెనుక నుంచి ఢీకొట్టడంతో మల్లికార్జున తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. అల్పేష్‌కు స్వల్ప గాయాలుకావడంతో కర్నూలు ఆస్పత్రికి తరలించారు.

పల్నాడులో యువకుడి ఆత్మహత్య


మంగ శేఖర్ (ఫైల్)

ఉప్పునుంతల: మండలంలోని మర్రిపల్లికి చెందిన మంగ శేఖర్ (22) మంగళవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లాలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లాలోని గురుజాల నియోజకవర్గం దాచేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నడికుడి రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు అక్కడి రైల్వే పోలీసులు గుర్తించారు. మృతుని పక్కనే పడిపోయిన సెల్‌ఫోన్ ఆధారంగా పోలీసులు హైదరాబాద్‌లో యువకుడు పనిచేస్తున్న పెంట్రోల్ బంక్ ద్వారా రాత్రి తల్లిదండ్రులకు సమాచారం అందజేశారు. కుటుంబసభ్యులు కొంతమంది గ్రామస్తులతో కలిసి రాత్రికి రాత్రే అక్కడికి బయలుదేరి వెళ్లారు. బుధవారం ఆ ప్రాంతంలోనే పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చారు. గత వానాకాలం సీజన్‌లో తమ సొంత వరికోత మిషన్ నడిపిన శేఖర్ తర్వాత హైదరాబాద్ వెళ్లి పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లోనే అమ్మాయితో ప్రేమ వ్యవహారమే యువకుడి ఆత్మహత్యకు కారణమంటూ గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడు మంగళవారం ఉదయమే హైదరాబాద్ నుంచి రైలులో బయలుదేరి వెళ్లినట్లు సహచరుల ద్వారా తెలిసినట్లు వారు తెలిపారు. మంగ పర్వాతాలు, పార్వతమ్మకు ఇద్దరు కుమారులు, కూతురు ఉండగా మృతుడు శేఖర్ పెద్దకొడుకు. చేతికి వచ్చిన కుమారుడు చనిపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యాంతమయ్యారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మార్కెట్‌కు పోటెత్తిన ఉల్లి


ఉల్లి కుప్పలతో నిండిపోయిన మార్కెట్

- పడి పోయిన ధరలు
- ఆందోళనలో రైతులు

దేవరకద్ర: పట్టణంలోని స్థానిక మార్కెట్‌కు బుధవారం ఉల్లి పోటెత్తింది. యాసంగి సీజన్‌లో పండిన ఉల్లిని రైతులు పెద్ద ఎత్తున అమ్మకానికి తేవడంతో మార్కెట్ ఆవరణలు, షెడ్లు, రోడ్లు ఎటు చూసిన ఉల్లి కుప్పలతో నిండిపోయింది. ఉదయం 10గంటలకు ప్రారంభం అయిన వేలం మధ్యాహ్నం 2గంటల వరకు కొనసాగింది. వందలాది కుప్పలకు వేలం వేయడానికి సమయం సరిపోక రెండు మూడు కుప్పలు కలిపి వేలం వేసే పరిస్థితి నెలకొంది.

మరింత పడిపోయిన ధర

మార్కెట్‌కు గత నెల నుంచి ప్రారంభమైన ఉల్లి సీజన్ ప్రస్తుతం కొనసాగుతుంది. అయితే ధరలు మాత్రం మరింత పడిపోయాయి. నాణ్యమైన ఉల్లి క్వింటాల్ గరిష్టంగా రూ.950 వరకు, కనిష్టంగా రూ.400 వరకు ధరలు వచ్చాయి. 45 కేజీల బస్తా రూ.500 నుంచి రూ.200 వరకు విక్రయించారు. చిరు వ్యాపారులతో పాటు వినియోగదారులు రావడంతో మార్కెట్ అంతా సందడిగా మారింది. ప్రస్తుతం వస్తున్న ఉల్లి నిల్వ చేసుకోడానికి అవకాశం ఉండడంతో చాలా మంది బస్తాలుగా కొనుగోలు చేశారు.

తిరిగి తీసుకెళ్లిన రైతులు..

ఉల్లి ధరలు లేక చాలా మంది రైతులు తిరిగి ఇంటి దారి పట్టారు. పెట్టుబడులు లేకున్నా కనీసం కూలి, ట్రాన్స్‌పోర్టు ఖర్చులు కూడా రాని పరిస్థితి వచ్చిందని రైతులు వాపోతున్నారు. కొందరు రైతులు తిరిగి తీసుకెళ్లలేక వచ్చిన ధరకే అమ్ముకున్నారు.

హైదరాబాద్‌లో అడిగే వారు లేరు..

ఇక్కడ కొనుగోలు చేసిన ఉల్లిని హైదరాబాద్ తీసుకెళితే అడిగే వారు లేరని వ్యాపారులు అంటున్నారు. మహారాష్ట్ర, కర్నాటక ప్రాంతాల నుంచి వస్తున్న ఉల్లి దిగుబడులు నాణ్యంగా ఉండడంతో పాటు క్వింటాల్ ధర రూ.800 నుంచి రూ.400 వరకు ఉండడంతో మన ఉల్లిని అడిగే వారు లేరని వ్యాపారులు తెలిపారు. ఒక వేళ ఇక్కడ కొని హైదరాబాద్ తరలిస్తే క్వింటాల్‌కు రూ.250 వరకు ఖర్చు వస్తుందని దీని వల్ల అసలుకే ఎసరు వస్తుందని వాపోయారు. కొన్న ధర రాకున్నా ఖర్చులు అన్ని మీద పడతాయని నష్టాన్ని భరించడానికి సిద్ధంగా లేమని వ్యాపారులు అంటున్నారు. యాసంగి సీజన్ దిగుబడులు పెరగడం వల్లనే ధరలు తగ్గుతున్నాయని ఇక్కడి మార్కెట్‌లో వస్తున్న ధరలు హైదరాబాద్ ధరల కన్నా ఎక్కువగా ఉన్నాయని తెలిపారు.

కూలి కూడా రావడం లేదు..



అర ఎకరం ఉల్లి పంటను సాగు చేశాను. ధరలు బాగా వస్తాయని అనుకుంటే మార్కెట్‌లో చూస్తే పెట్టుబడి కాదు కనీసం కూలి కూడా రాని పరిస్థితి. తెచ్చిన ఉల్లికి క్వింటాల్ ధర రూ.400 వరకు వేలంలో పలికింది. ట్రాక్టర్ నిండా తెచ్చిన ఉల్లికి రూ.6వేలు కూడా రావడం లేదు. కూలిలు, రవాణా కలిపి రూ.4 వేలు అయింది.

– గొల్ల కేశవులు, రైతు, నార్లోనికుంట్ల

గత నెల వచ్చిన ధర ఈ వారం లేదు..



గత నెల ఉల్లిని మార్కెట్‌కు తెస్తే క్వింటాల్‌కు రూ.1200 వరకు వచ్చింది. ఈ వారం రెండో విడత కోత కోసి తీసుకురాగా ధర చూస్తే రూ.650 వచ్చింది. ఇలా ఒక్కసారిగా ధరలు పడిపోతే ఎలా పంటలు పండించాలి. వచ్చిన ధర చూస్తే అమ్ముకోడానికి మనసొప్పడం లేదు. అయినా తప్పని పరిస్థితిలో అమ్ముకుంటున్నా.

– గోపాల్, ఉల్లి రైతు, పల్లిగడ్డ, ధన్వాడ మండలం

అగ్నిప్రమాదాలపై అప్రమత్తం


రాజాపూర్ ప్రాథమిక వైద్య ఆరోగ్యకేంద్రం తనిఖీ చేస్తున్న ఫైర్‌సిబ్బంది

- కొనసాగుతున్న ఫైర్ తనిఖీలు
- ఆస్పత్రులపై ప్రత్యేక దృష్టి
- ఏప్రిల్ 10 వరకు అన్ని భవనాల పరిశీలన

జడ్చర్ల టౌన్: వేసవిలో అగ్నిప్రమాదాలు కాకుండా పట్టణంలోని ఫైర్‌స్టేషన్ ఆధ్వర్యంలో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. మొదట ఆస్పత్రులు, పాఠశాలలు, అపార్ట్‌మెంట్లు, జన సమూహం ఉండే ప్రాంతాలపై దృష్టి సారించనున్నారు. ఫైర్‌స్టేషన్ పరిధిలోని జడ్చర్ల, రాజాపూర్, బాలానగర్, మిడ్జిల్ మండలాలతో పాటు నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలంలో ఫైర్ సిబ్బంది తనిఖీ చేపట్టారు. ఇటీవల హైదరాబాద్‌లో చోటు చేసుకున్న అగ్నిప్రమాదాల్లో ప్రాణనష్టం అయిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మహబూబ్‌నగర్ జిల్లా ఫైర్ అధికారి ఆదేశాల మేరకు స్థానిక ఫైర్‌స్టేషన్ సిబ్బంది వారం రోజులుగా అప్రమత్తం చేస్తున్నారు. ఏప్రిల్10వరకు తనిఖీ నిర్వహించి ప్రమాదాలు కాకుండా అవగాహన కల్పించటంతో పాటు జాగ్రత్తలు తీసుకునేలా చూస్తున్నారు.

ఆస్పత్రి భవనాల పరిశీలన

మొదట మండల కేంద్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులను ఫైర్ సిబ్బంది తనిఖీ నిర్వహించారు. అగ్నిప్రమాదం సంభవిస్తే ప్రాణనష్టం కాకుండా ఉండేలా, ఫైర్ వాహనం సులువగా వెళ్లి వచ్చేలా నిర్మాణాలు ఉన్నాయా అని పరిశీలించారు. నిబంధనలు పాటించని వారికి నోటీసులు జారీ చేస్తున్నారు. మరోసారి తనిఖీలకు వచ్చినపుడు తప్పనిసరిగా తాము చెప్పిన జాగ్రత్తలు అన్ని తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు. మండలంలోని 12 ఆస్పత్రులను వారు తనిఖీ చేశారు. బుధవారం రాజాపూర్, బాలానగర్ ఆస్పత్రులను, గంగాపూర్ రోడ్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాల భవనాన్ని సైతం పరిశీలించారు.

ముందు జాగ్రత్తగా..



జిల్లా ఫైర్ అధికారి ఆదేశాల మేరకు ముందు జాగ్రత్తగా అన్ని ఆస్పత్రులు తనిఖీ పూర్తిచేశాం. అపార్ట్‌మెంట్లు, పాఠశాల భవనాలు, లాడ్జీలు, హోటళ్లు, ఫంక్షన్‌హాళ్లు, సినిమా థియేటర్లు పరిశీలించేలా ప్రణాళికలు రూపొందించాం. ప్రమాదాలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పటంతోపాటు ప్రమాదాలు అయితే ఫైర్ వాహనం సులువుగా వచ్చి వెళ్లేలా నిర్మాణాలు ఉండాలని, ప్రాణనష్టం కాకుండా అవగాహన కల్పిస్తున్నాం.

– మల్లికార్జున్, ఫైర్ ఆఫీసర్, జడ్చర్ల

ఉదండాపూర్ రిజర్వాయర్ పనుల పరిశీలన

జడ్చర్ల: మండలంలోని కోడ్గల్ చెందిన రైతులు, మహిళలు జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య ఆధ్వర్యంలో బుధవారం ఉదండాపూర్ రిజర్వాయర్ పనులను పరిశీలించారు. సీఎం కేసీఆర్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో సందర్శించి ప్రజలకు అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఇమ్ము, రాంచంద్రయ్య పాల్గొన్నారు.


సొరంగాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య తదితరులు

ఉద్యోగుల అక్రమ విభజన ఆపాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): మహబూబ్‌నగర్ సర్కిల్ నుంచి నారాయణపేట జిల్లాకు చేసిన ఉద్యోగుల అక్రమ విభజనను ఆపాలని తెలంగాణ విద్యుత్ ఉద్యోగులు 1104 రీజినల్ అధ్యక్షుడు స్వామి అన్నారు. ఉద్యోగుల అక్రమ విభజనను ఆపాలని కోరుతూ విద్యుత్ భవన్ ఎదుట చేపడుతున్న ధర్నా బుధవారం రెండోరోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణపేట జిల్లాకు సరిపడే పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ మాత్రమే ఎందుకు కిందిస్థాయి ఉద్యోగులను విభజించాల్సి వచ్చిందని ప్రశ్నించారు. విభజనలో ఎక్కువ మొత్తంలో వితంతు మహిళలు, తల్లిదండ్రులను కోల్పోయిన కిందిస్థాయి ఉద్యోగులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎస్ఈ శ్రీరాంమూర్తి చాంబర్‌లో బైఠాయించి నిరసన తెలిపి వినతిపత్రం అందజేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి పాండు, నాయకులు యాదయ్యగౌడ్, డివిజన్ కార్యదర్శి శ్రీనివాస్, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పెంటయ్య, సర్కిల్ యూనిట్ ప్రెసిడెంట్ రామరాజు, యూనిట్ కార్యదర్శి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.


ఎస్ఈ శ్రీరాంమూర్తితో మాట్లాడుతున్న విద్యుత్ ఉద్యోగులు

వైభవంగా సీతారాముల మాస కల్యాణం

సిర్సనగండ్లకు పోటెత్తిన భక్తులు


మాస కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం సీతారాముల మాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి వేడుక తిలకించారు. ఆలయ చైర్మన్ ఢేరం రామశర్మ, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, అమ్రాబాద్ జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ, కల్వకుర్తి డీఎస్పీ గిరిబాబు, ఎస్ఐ కళ్యాన్‌రావు, ఎంపీపీ నిర్మల విజేందర్‌గౌడ్, సింగిల్ విండో చైర్మన్ గురువయ్యగౌడ్, డీటీ విద్యాధరి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఈఓ రఘు, అర్చకులు మురళీధర్‌శర్మ, లక్ష్మణ్‌శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సీతారాముల కల్యాణం..

శ్రీరామనవమిని పురస్కరించుకొని గురువారం మధ్యాహ్నం 12 గంటలకు సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, అధికారులు ప్రభుత్వం తరుపున అమ్మ, స్వామివార్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందించనున్నారు. ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా గట్టి బందోబస్తు, సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశామని సీఐ రామకృష్ణ, ఎస్ఐ కళ్యాన్‌రావు తెలిపారు.


హాజరైన భక్తులు

బియ్యం గింజలపై.. శ్రీరామనామం


బియ్యం గింజపై శ్రీరామ నామాన్ని రాస్తున్న చక్రవర్తి


బియ్యంపై శ్రీరామ నామం

శ్రీరామ నవమిని పురస్కరించుకొని అయిజ మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాలకు చెందిన ఆచార్య చక్రవర్తిస్వామి బియ్యం గింజలపై శ్రీరామ నామాన్ని రాస్తున్నాడు. గత 41 రోజుల నుంచి 35 వేల బియ్యం గింజలపై శ్రీరామనామాన్ని రాసి భక్తిని చాటుకున్నాడు. ఈ బియ్యాన్ని గురువారం గ్రామంలో నిర్వహించే సీతారాముల కల్యాణంలో అక్షింతలుగా ఉపయోగిస్తున్నట్లు ఆయన చెప్పారు.

– అయిజ

తాను చనిపోతూ... నలుగురికి ప్రాణదానం


కిష్టప్ప (ఫైల్)

ధరూరు: తాను చనిపోయినా.. మరో నలుగురికి జీవం పోసి చిరస్థాయిగా నిలిచిపోయాడు మండలంలోని మాల్‌దొడ్డికి చెందిన బోయ కిష్టప్ప. వివరాలిలా.. గ్రామానికి చెందిన కిష్టప్ప(42) జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లి ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అనారోగ్యానికి గురైన నాలుగు రోజుల క్రితం హై బీపీ రావడంతో బ్రెయిన్‌లో బ్లడ్‌క్లాట్ అయ్యింది. దీంతో ఆయనను అక్కడే ఉన్న యశోద ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందాడు. అయితే ఆస్పత్రి వైద్యులు కుటుంబ సభ్యులకు నచ్చజెప్పడంతో అవయవదానం చేసేందుకు ముందుకొచ్చారు. దీంతో బ్రెయిన్ డెడ్ అయి మరణించిన కిష్టప్ప గుండె, కిడ్నీ, లివర్‌లను దానం చేశాడు. సాయంత్రం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

గెస్ట్ పీఈటీకి దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉమ్మడి జిల్లాలోని తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో గెస్ట్ పీఈటీ, స్టూడెంట్ కౌన్సెలర్‌గా పనిచేసేందుకు దర ఖాస్తులు చేసుకోవచ్చని టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్ (గురుకులం) ప్రాంతీయ సమన్వయ అధికారి కె.నాగార్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. బాలానగర్‌లో మహిళా పీఈటీ, స్టూడెంట్ కౌన్సెలర్ (మహిళ/పురుషులు) ఒక్కో పోస్టు, కల్వకుర్తిలో స్టూడెంట్ కౌన్సెలర్ (మహిళ/పురుషులు) పోస్టు ఖాళీగా ఉందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్‌లోని టీఎస్ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపాల్ నుంచి దరఖాస్తులు పొందాలని, పూర్తిచేసి వచ్చే నెల 12వ తేదీలోగా అక్కడే సమర్పించాలని సూచించారు. ఏప్రిల్ 15వ తేదీ ఉదయం పది గంటలకు మహబూబ్‌నగర్–అప్పన్నపల్లి, తిరుమల హిల్స్‌లోని తమ కార్యాలయంలో నిర్వహించే డెమోకు హాజరుకావాలని, పూర్తి వివరాలకు సెల్ నం.9490957312లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

రుసుంపల్లి వాసికి కీర్తి పురస్కారం

గండేడ్: మండలంలోని రుసుంపల్లికి చెందిన మాలెల అంజిలయ్యగౌడ్‌కు కీర్తి పురస్కారం లభించింది. రేడియో ఆరిస్టుగా పనిచేసిన ఈయన వందలకు పైగా నాటకాల్లో పాత్రలను పోషించాడు. ప్రత్యేక నటుడుగా గుర్తింపు పొందిన ఇతనికి తెలుగు విశ్వవిద్యాలయం వారు 2020 సంవత్సరానికి గాను కీర్తి పురస్కారానికి ఎంపిక చేశారు. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ కిషన్‌రెడ్డి చేతులమీదుగా కీర్తి పురస్కారాన్ని అందుకున్నట్లు తెలిపారు.


పురస్కారం అందుకుంటున్న మాలేల అంజిలయ్యగౌడ్

తల్లీకూతుళ్ల అదృశ్యం



అదృశ్యమైన తల్లి, కూతురు

నవాబుపేట: ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా తల్లీకూతుళ్లు అదృశ్యమైన సంఘటన మండలంలోని మల్కాపూర్‌లో చోటుచేసుకుంది. ఈ సంఘటన వివరాలు... మల్కాపూర్‌కు చెందిన వడ్డె యాదమ్మ(38), ఆమె కూతురు వడ్డె నందిని(15) అనే తల్లికూతుళ్లు గత సోమవారం 27వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయారని అప్పటి నుంచి బంధువులతో పాటు గ్రామంలో తెలిసిని వారితో వెతికిన లాభం లేకపోవటంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు అదృశ్యమైన మహిళ భర్త నర్సింహులు తెలిపారు. కాగా తాను తన కొడుకు ఎప్పటి మాదిరిగా రాళ్లు కొట్టేందుకు వెళ్లామని, తీరా సాయంత్రం ఇంటికి వచ్చే సరికి వారు కనిపించటేదని వివరించారు. కాగా నాలుగేళ్ల క్రితం అదృశ్యం అయిన మహిళ అక్క నా మొదటి భార్య శాంతమ్మ అనారోగ్యంతో మృతి చెందితే ఆమె చెల్లెలు అయిన యాదమ్మతో రెండో వివాహం చేసుకున్నట్లు నర్సింహులు తెలిపారు. కాగా సంసారం సాఫీగానే సాగుతున్న తరునంలో వీల్లు ఇంట్లో నుంచి అదృశ్యం కావటంతో పోలీసులను ఆశ్రయించినట్లు ఆయన వివరించారు. ఈ విషయంలో కేసునమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని ఎస్ఐ పురుషోత్తం తెలిపారు.

పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

పాలమూరు: ఇటీవల జరిగిన టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని మాజీ ఎంపీ రవీంద్రనాయక్ అన్నారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగత యువత ఆశలు, ఆశయాలు ఈ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నెరవేరకుండాపోయాయని తెలిపారు. పేపర్ లీకేజీలో ఉన్న పెద్దలను వదిలేసి చిరు ఉద్యోగులను బాధ్యులుగా చూపి తప్పిదాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ ఆయన కూతురు కవితను కాపాడుకునే ప్రయత్నంలో తెలంగాణ సమాజాన్ని పట్టించుకోవడంలేదన్నారు. రాష్ట్రంలో ఈ బీఆర్ఎస్ ప్రభుత్వం విద్య, వైద్యాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. కార్యక్రమంలో క్రిష్టనాయక్, పాండురంగారెడ్డి, నారాయణ యాదవ్, గోవింద్ నాయక్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఇంట్లో నగదు, బంగారం అపహరణ

మన్ననూర్: స్థానిక ఉమామహేశ్వర కాలనీలో బుధవారం తెల్లవారుజామున ఇంట్లో దొంగలు పడి నగదు, బంగారం ఎత్తుకెళ్లిన సంఘటన చోటు చేసుకుంది. అమ్రాబాద్ ఎస్ఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మన్ననూర్‌లోని ఉమామహేశ్వర కాలనీకి చెందిన విస్లావత్ సాలి వేసవికాలం కావడంతో ఇంటికి గడియపెట్టి కుటుంబ సభ్యులతో కలిసి ఆరుబయట నిద్రించారు. ఈ క్రమంలో దొంగలు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న రూ.15 వేల నగదు, 3 తులాల బంగారం ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదు చేశారని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి క్లూస్ టీంతో సంఘటన స్థలాన్ని పరిశీలించినట్లు పేర్కొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి నిప్పటించిన దుండగులు

కోయిల్‌కొండ: మండలంలోని వింజామూర్‌లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు పెట్రోల్ పోసి నిప్పంటించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి అంబేద్కర్ విగ్రహాన్ని పరిశీలించారు. ఈ విషయమై గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ సతీష్ తెలిపారు. త్వరలోనే నిప్పటించిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆ తర్వాత మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మంత్రి నర్సింహ్మయ్య ఘటనా స్థలానికి చేరుకొని అంబేద్కర్ విగ్రహాన్ని పరిశీలించి మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తాలో ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో, పోలీసుస్టేషన్‌లో నిప్పటించిన దుండగులను వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలని ఫిర్యాదు చేశారు.